పత్రికాప్రకటన కాకినాడ, 10.7.2018

కౌశల్ గోదావరి ప్రొజెక్ట్ ద్వారా అందిస్తున్న ఉపాధి, నైపుణ్యాల శిక్షణా కార్యక్రమాలను బడుగు బలహీన వర్గాల యువత సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు కోరారు.

మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ హాలులో కౌశల్ గోదావరి ప్రొజెక్ట్, బిసి కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పూర్తి చేసుకున్న నాయీ బ్రాహ్మణ అభ్యర్థులకు కాకినాడ సిటి ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, కాకినాడ నగర మేయర్ సుంకర పావని సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి కుటుంబాని 10 వేల రూపాయాల నెలసరి ఆదాయం కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం యువతకు వివిధ వృత్తి నైపుణ్యాలలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈదిశగా జిల్లాలో వినూత్నంగా చేపట్టిన కౌశల్ గోదావరి ప్రొజెక్ట్ ద్వారా వివిధ ఉపాధి అంశాలలో శిక్షణ పొంది ఇప్పటికే వేల సంఖ్యలో యువత లబ్ది పొందారన్నారు. కాకినాడ సిటీ, రూరల్ పరిధిలో ఈ ప్రొజెక్ట్ ద్వారా నిర్వహించిన బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పొందిన 165 మంది నాయీబ్రాహ్మణ అభ్యర్థులను అభినందించి, క్రొత్తగా నేర్చుకున్న నైపుణ్యాలు వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంచి మరింత మెరుగైన ఉపాధి, ఆదాయాలను అందించ గలవన్నారు. ఇదే తరహాలో కౌశల్ గోదావరి ప్రొజెక్ట్ ద్వారా వివిధ వృత్తుల వారికి సుమారు 20 ఉపాధి అంశాలలో నైపుణ్యాల శిక్షణలు నిర్వహిస్తున్నారని, వాటిని బడుగు, బలహీన వర్గాల యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నగర మేయర్ సుంకర పావని మాట్లాడుతూ మారుతున్న అభిరుచులు, సాంకేతికతల కనుగుణంగా సాంప్రదాయ వృత్తులలో నైపుణ్యాలను ఎప్పటికప్పుడు తాజా పరచుకోవలసిన అవసరం ఉందని, అందుకు కౌశల్ గోదావరి ప్రొజెక్ట్ నిర్వహిస్తున్న శిక్షణ ఎంతగానో దోహదం కాగలదన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులు బ్యాంకుల ద్వారా రుణాలు పొందడం సులభతరమౌతుదని, తద్వారా తమ ఉపాధిని మరింత విస్తృతం చేసుకోవచ్చున్నారు.

బిసి కార్పొరేషన్ ఈడి యం.జ్యోతి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకూ 6 కేంద్రాలలో బ్యూటీషియన్ కోర్సులో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించామని, సుమారు 800 మంది నాయీబ్రాహ్మణ అభ్యర్థులు వీటి ద్వారా లబ్ది పొందరని తెలిపారు. కౌశల్ గోదావరి ప్రొజెక్ట్ అధికారి చంద్రారెడ్డి తమ సంస్థ ఇప్పటి వరకూ 2600 మందికి వివిధ ఉపాది అంశాలలో నైపుణ్య శిక్షణ అందించిందన్నారు. వృత్తి శిక్షణతో పాటు కష్టమర్లను ఆకట్టుకునే కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా అభ్యర్థులకు నేర్పుతున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో శిక్షణ పొందిన అభ్యర్థులు బ్యూటీషియన్ కోర్స్ ద్వారా తాము పొందిన ప్రయోజనాలను తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాకినాడ ఎఎంసి చైర్మన్ ఎన్.విశ్వనాథ్, నాయీబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు ఎస్.శ్రీనివాసరావు, బి.వీరబాబు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ)